క్లుప్తంగా

జంట కవులకు సత్కారం

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన జంట కవులు శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణలు ఏలూరులో జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాల వేదికపై సత్కారం అందుకున్నారు. సంబరాల్లో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని సంక్రాంతిపై కవితా గానాలు చేసిన వారిద్దర్నీ రూ.5 వేల నగదు, జ్ఞాపికలతో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, మహాకవి బోయి భీమన్న సతీమణి హైమావతి సత్కరించారు. జంట కవులను మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అభినందించారు.

23 మందికి రక్తదానం



రక్తదానం చేస్తున్న స్వామి వివేకానంద యోగాశ్రమ యువకులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రక్తం అత్యవసరమైన 23 మంది గర్భిణులు, తలసేమియా రోగులకు అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న యువకులు గురువారం రక్తదానం చేశారు. యోగాశ్రమానికి చెందిన బి.పవన్‌కుమార్, జి.దుర్గాప్రసాద్, యు.సూరిబాబు, పి.ప్రశాంత్, ఎల్.అనిల్, కె.మాధవ్, ఎం.దుర్గ, పి.సుధీర్, ఎల్.కార్తీక్ తదితరులు రక్తదానం చేసినట్లు యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ఐ.పోలవరం: జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పశువులకు టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి ఎస్.గణేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి గాలి ద్వారా, కలుషితమైన నీరు, మేత ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి సోకిన పశువులకు నాలుక, నోటిలో, ముక్కుపై, కాలి గిట్టలపై పొక్కులు, బొబ్బలు వస్తాయని చెప్పారు. అంతేకాకుండా పాల దిగుబడి గణనీయంగా తగ్గి రైతులకు ఆర్థికంగా నష్టం కలుగజేస్తుందన్నారు. అందుకే పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు.

రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ

కాట్రేనికోన: మండలంలోని కందికుప్ప పంచాయతీలో రేషన్ షాపు నెంబరు-24ను ఫుడ్ కమిటీ సభ్యుడు జక్కంపూడి కిరణ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపులో బియ్యం అక్రమ నిల్వలపై డీలరును ఆయన నిలదీశారు. లబ్ధిదారులు తనఖా పెట్టిన సుమారు 80 రేషన్ కార్డులకు చెందిన 13 బస్తాల బియ్యంతో పాటు రికార్డుల్లో లెక్కలు లేని మరో 10 బస్తాల బియ్యం ఉన్నట్లు ఆయన గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎంఎస్‌ఓను విచారణ కోరగా డీలరుపై కేసు నమోదు చేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 ఫీడర్ల పరిధిలో ఉన్న మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉప్పలగుప్తం మండలంలో...

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లిలో 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మండలంలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై 17 నుంచి శిక్షణ



శిక్షణా కార్యక్రమంపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళిక తయారుచేయడంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఈ నెల 17, 18 తేదీలో మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. అల్లవరం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ వనరుల రిసోర్స్ పర్సన్ మూర్తి, ఈఓపీఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, డిజిటల్ అసిస్టెంట్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి అన్ని విభాగాలు వారు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

సంక్రాంతి అతిథులొస్తున్నారు

- గ్రామాల్లో సందడి చేస్తున్న హరిదాసులు, జంగమ దేవరలు, బుడబుక్కల వేషధారులు



డూడూ బసవన్నలు



జంగమ దేవర వేషధారణలో..



కొమ్మదాసరి వేషధారి

ముమ్మిడివరం: తెలుగింట పెద్ద పండగ సంక్రాంతి సంబరాలు ముందస్తుగా ప్రారంభమయ్యాయి. తెలుగు లోగిళ్లు, ముగ్గులతో వాకిట విరిసే హరివిల్లు అన్న చందంగా ఇంటింటా రంగవల్లులు దర్శనమిస్తున్నాయి. చిన్నారులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలంటూ వేదపండితుల ఆశీర్వచనంతో భోగి పండ్ల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పిల్లలు భోగి పిడకలు వేస్తూ భోగి దండలు తయారు చేసుకునే పనిలో పడ్డారు. హరిదాసులకు బియ్యం, దానధర్మాలు చేసిన తరువాతే పండగ పనులు మొదలుపెట్టడమనేది అనేక ప్రాంతాల్లో ఆచారంగా వస్తోంది. గ్రామాల్లో హరిహరిలో రంగ హరీ.. శ్రీమద్రామయణ గోవిందో హరీ అంటూ సంకీర్తనలు పాడుతూ హరిదాసులు ఇంటింటికీ తిరుగుతూ సందడి చేస్తున్నారు.

భలే దొడ్డ దొరండీ మాబసవన్న అంటూ గంగిరెద్దులతో విన్యాసాలు చేయించే డూడూ బసవన్నలు తెలుగు సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేస్తున్నారు. అంబ పలుకు.. జగదంబ పలుకు.. కాశీ అన్నపూర్ణ పలుకు.. అంటూ జంగమ దేవర శంఖారావాలు ఊరూరా పండగ శోభను తీసుకొచ్చాయి. ఇంటింటికీ వెళ్లి శంఖారావంతో శివున్ని కీర్తిస్తూ పిల్లా పాపలు చల్లగా ఉండాలంటూ దాతలను ఆశీర్వదిస్తున్నారు. కొమ్మదాసరులు, బుడబుక్కల కళాకారులు పల్లెల్లో పండగ కళను ముందే తీసుకొచ్చారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి సంక్రాంతి పండగ ముగిసేవరకూ ఊరూరా తిరిగే వీరంతా మన సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాళ్లు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



జి.వేమవరంలో కోడి పందేలపై స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు



అల్లవరంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు



చెయ్యేరులో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు

ఐ.పోలవరం: మండలంలో కోడి పందేల నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎస్.రాజేష్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కోడి పందేల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవని, అనుమతులు ఉన్నాయని ఎవరైనా ప్రచారం చేసినా నమ్మవద్దన్నారు. ఇప్పటికే మండలంలో కోడిపందేల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదుచేశామన్నారు. మండలంలోని కొమరగిరి, జి.వేమవరం, కేశనకుర్రుపాలెం, మురమళ్ల, తదితర గ్రామాల్లో పందేలు నిర్వహించే స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశామన్నారు. కోడి పందేలు, గుండాటలు, అశ్లీల నృత్యాలకు ఎవరూ సహకరించకూడదని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అల్లవరం: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎస్‌ఐ హరీష్‌కుమార్ హెచ్చరించారు. ఏటా కోడి పందేలు నిర్వహించే కోడూరుపాడు, గుత్తులవారిపాలెం, అల్లవరం గ్రామాల్లో తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎస్‌ఐ హరీష్‌కుమార్, పశువైద్యాధికారి నారాయణరావులు గురువారం పర్యటించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. కోడి పందేలు నిర్వహించినా, ప్రోత్సహించినా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కాట్రేనికోన: సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందేలు నిర్వహిస్తే సహించేది లేదని తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్‌ఐ నాగేశ్వరరావులు హెచ్చరించారు. మండలంలో చెయ్యేరు, గెద్దనపల్లి పంచాయతీల వద్ద సర్పంచుల అధ్యక్షతన కోడిపందేలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏటా పందేలు నిర్వహించే చెయ్యేరు, గెద్దనపల్లి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత



నడిపూడిలో అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దొండపాటి లోవరాజు కుటుంబానికి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు సాయం అందించారు. రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ) ఆదేశాలతో రెడ్‌క్రాస్ సభ్యులు చేతుల మీదుగా వంట సామగ్రి, హైజెనిక్ కిట్స్, నిత్యావసర సరకులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు జల్లి సుజాత, పినిపే మురుగేశ్వరరావు, బీర సందీప్, ఒరిగిటి బాలరాజు, దంగేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోడి పందేలు వద్దు.. క్రీడలే ముద్దు



పి.మల్లవరంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు కోడి పందేలు, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు జోలికి వెళ్లకుండా క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. 13వ సంక్రాంతి సంబరాల్లో భాగంగా పి.మల్లవరంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వాలీబాల్ పోటీలను ఎంపీపీ సునీత ప్రారంభించారు. నాకౌట్ పద్ధతిలో డే అండ్ నైట్, ఫ్లడ్ లైట్స్ కాంతుల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 28 జట్లు తలపడుతున్నాయి. తొలి మ్యాచ్‌లో ఐ.పోలవరం మండలం నిమ్మకాయల కొత్తపల్లి, తాళ్లరేవు మండలం సీతారామపురం జట్ల మధ్య పోటీ హోరాహోరీగా జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, టి.ఈశ్వరరావు, వడ్డి ఏడుకొండలు, రెడ్డి రెడ్డిబాబు, వెంటపల్లి నూకరాజు, దున్నా రాంబాబు, పెట్ల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రైసుమిల్లు కార్మికులు



ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన రైసుమిల్లు కార్మికులు

యానాం: రెండేళ్ల క్రితం చేసుకున్న వేతన ఒప్పందం 2023 నవంబర్‌కు పూర్తయినా రైసుమిల్లు యాజమాన్యాలు స్పందించడం లేదని రైసుమిల్లు కార్మికులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దృష్టికి తీసుకొచ్చారు. గురువారం స్థానిక ఆఫీసులో ఎమ్మెల్యే అశోక్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించుకున్నారు. కార్మికులు పెట్టిన డిమాండ్‌లకు యాజమాన్యం అంగీకరించకుండా తాత్సారం చేస్తుందని, ఇప్పటికే వేతన ఒప్పంద సమస్యను లేబర్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే అశోక్‌కు తెలిపారు. 17వ తేదీన మరోసారి చర్చలకు రావాలని లేబర్ ఇన్‌స్పెక్టర్ చెప్పారన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని లేబర్ ఆఫీసర్‌తో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, కన్వీనర్ కుంచే సత్యనారాయణ, సలాది నాగబాబు, తిరుకోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో సమర్పించాలి



సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పెన్షనర్లందరూ వచ్చే నెలాఖరులోగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో సమర్పించాలని అమలాపురం అసిస్టెంట్ సబ్‌ట్రెజరీ అధికారి(ఏటీవో) బీవీవీఎస్ఎస్ రంగారావు సూచించారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశం స్థానిక ఏవీఆర్‌నగర్‌లోని అసోసియేషన్ భవనంలో గురువారం జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణశాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏటీవో రంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెన్షనర్స్ డే సందర్భంగా జిల్లాలోని 18 మంది సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. అనంతరం అసోసియేషన్ భవనం పైఅంతస్తులో నూతనంగా నిర్మించిన ఫ్యామిలీ పోర్షన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గదుల నిర్మాణ దాతలు యర్రమిల్లి పాండురంగారావు, కూచిమంచి నాగమణి, డీఎస్ఎన్‌రాజు, సీనియర్ పెన్షనర్లు ఐవీ శ్రీనివాసరావు, కేఎస్‌వీ సత్యనారాయణ, సబ్ ట్రెజరీ అధికారి ఎం.వెంకటనారాయణ, కేకేవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులకు సంబంధించి ఎంపీపీ రాయుడు సునీత గురువారం నియామక పత్రాలు అందజేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బోయిడి లోవకుమార్(సుంకరపాలెం), తిరుకోటి అపర్ణ(కోరంగి), తొత్తరమూడి కిరణ్(పోలేకుర్రు), పోతుల పవన్‌కల్యాణ్(పిల్లంక)లకు నియామక పత్రాలు ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని ఎంపీపీ సునీత కోరారు. కార్యక్రమంలో రాయుడు గంగాధర్, పెయ్యల మంగేష్, అర్ధాని రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రావులపాలెం: నడవలేని స్థితిలో ఉన్న ఓ మహిళకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న ఆమె కుటుంబ సభ్యులు స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. ఈ క్రమంలో గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తీర్లిక పద్మశ్రీకి వయస్సు రీత్యా రెండు మోకాళ్లు అరిగిపోయి, నడవలేని స్థితిలో ఉంది. వైద్యులు ఆపరేషన్ చెయ్యాలని సూచించారు. పద్మశ్రీకి భర్త, కొడుకులు లేరు. ప్రస్తుతం కూతురితో, రావులపాలెంలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. అల్లుడి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవాసంస్థ సభ్యులు ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు.

రహదారి భద్రతా వారోత్సవాల నిర్వహణ

యానాం: స్థానిక నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్‌ఐ పువ్వల వీరభద్రస్వామి, కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్, యువజన అధికారి తిర్రి గోపి గురువారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 17 వరకూ పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. 25 మంది వలంటీర్లకు పోలీస్ శాఖ ట్రాఫిక్ విభాగం సహకారంతో శిక్షణ నిర్వహించామని చెప్పారు.

నేడు నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ జి.లోవరాజు తెలిపారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగే బడ్జెట్ సమావేశానికి వివిధ శాఖాధికారులు, కౌన్సిల్ సభ్యులు విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.


ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు



పటవలలో ఉత్సాహంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

తాళ్లరేవు: మండలంలోని పటవల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ రాయుడు సునీత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయికి పంపనున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలకు సంబంధించి 34 మ్యాచ్‌లు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ మోకా ఉమ, పంచాయతీ కార్యదర్శులు వీజేవీ రమణ, సూరంపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలి



విలసవిల్లిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ అరుణకుమారి తదితరులు

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా మండలంలోని విలసవిల్లిలో ఆమె ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ, వీఆర్వో అహ్మద్ అలీషా, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సామాజిక సమతా సంకల్పం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువులో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం సర్పంచ్ నక్కా అరుణకుమారి అధ్యక్షతన గురువారం జరిగింది. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణను పురస్కరించుకుని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టమ్మ చెరువు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పందిరి హరిరామ్‌గోపాల్, వార్డు సభ్యుడు రాజులపూడి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మెండు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అడబాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నరసింహారావుకు అంతర్జాతీయ అవార్డు



జేవీఎల్ నరసింహారావు

ముమ్మిడివరం: మహారాష్ట్రలోని పూణేకు చెందిన వాక్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ఎడ్యుకేషనిస్ట్ విభాగంలో అందించే వివేకానంద-2024 ఇంటర్నేషనల్ అవార్డు ఎల్లా ఇంటర్నేషనల్ కన్వీనర్ జేవీఎల్ నరసింహారావుకు లభించింది. దేశ విదేశాలకు చెందిన వేలాదిమంది దరఖాస్తు చేసుకోగా 50 మందికి మాత్రమే ఈ అవార్డు లభించిందని ఆయన తెలిపారు. అవార్డు అందుకున్న జేవీఎల్‌ను పలువురు అభినందించారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేసిన ఎంపీ అనురాధ

అల్లవరం: మండలంలోని గోడితిప్ప గ్రామానికి చెందిన దివ్యాంగుడు కోలా భూషణానికి ఓఎన్‌జీసీ సౌజన్యంతో సమకూర్చిన ట్రైసైకిల్‌ని మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ చింతా అనురాధ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అగ్రమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, వేణుగోపాల్, కొప్పాడి వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని భీమ్‌నగర్‌లో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయబద్ధంగా దుస్తులను ధరించి పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా భోగి మంటను వేసి సంక్రాంతి పండగ పాటలు ఆలపించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం పోతాబత్తుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి

కాట్రేనికోన: మండలంలోని బ్రహ్మ సమేధ్యం పంచాయతీ బలుసుతిప్ప మడ అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై సిబ్బందితో కలిసి ఎస్‌ఐ నాగేశ్వరరావు దాడి చేశారు. సారా కాసేందుకు సిద్ధం చేసుకున్న బట్టీలను ధ్వంసం చేశారు. 30 డ్రమ్ముల్లో ఉంచిన బెల్లం ఊటను, 420 లీటర్ల నాటు సారాను అటవీ ప్రాంతంలో పారబోశారు. కేసు నమోదు చేశామని, నిర్వాహకులను గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అపాయింట్‌మెంట్ల అందజేత

యానాం: మాహే, యానాం, కారైకల్, పుదుచ్చేరి రీజియన్ల నుంచి అప్పర్ డివిజినల్ క్లర్క్(యూడీసీ) ఉద్యోగాలకు ఎంపికైన 104 మంది అభ్యర్థులకు సీఎం రంగసామి గురువారం అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేశారు. యానాం నుంచి నక్కా చైతన్య, మహ్మద్ షారూఖ్, పేరాబత్తుల వీరబాబు, దేవన రాజు, బందకవి సాయికృష్ణ, దంగుడు బియ్యం వీరనాగలక్ష్మి, సుబ్రహ్మణ్య మహేష్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్నారు.

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: ఫొటోగ్రాఫింగ్ వృత్తినే నమ్ముకుని ఉన్న ఫొటో, వీడియోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని లూయిస్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. మండలంలోని గొల్లవిల్లిలో అసోసియేషన్ మండల స్థాయి సమావేశం అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి జాన భవానీ శంకర్, బొక్కా పుల్లంశెట్టి, జంగా రవికుమార్, చోడిశెట్టి ఆదినారాయణ, ముంగండ సత్తిబాబు, సలాది శివాజీ, దేవదాసు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు

యానాం: స్థానిక జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యానాం డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అండర్-16 బాల బాలికలకు రన్నింగ్, బ్రాడ్ జంప్, షాట్‌పుట్, జావిలిన్ త్రో తదితర అథ్లెటిక్స్ పోటీలు గురువారం నిర్వహించారు. పోటీల్లో పలువురు విద్యార్థులు పతకాలు సాధించారని అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శులు కాపగంటి శేషుమన్, చింతా వెంకన్నలు తెలిపారు. సీఐఎస్ఎఫ్ రిటైర్డ్ ఏఎస్పీ తొత్తరమూడి చింతా వెంకన్న పాల్గొని విజేతలకు 75 బంగారు, కాంస్య పతకాలను అందజేశారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నక్కల సుబ్బన్న, చింతం రామకృష్ణ, పాలికి ప్రకాష్, జల్లి చంద్రశేఖర్, వినకోటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.